# పంట మార్పిడితో ప్రయోజనం

- తరచూ ఒకే పంట సాగు చేస్తే నష్టాలు
- చీడపీడల ఉధృతి ఎక్కువే
- పెట్టుబడి కూడా పెరుగుతుంది
- పంట మార్పిడితో భూమిలో సేంద్రియ పదార్థాల వృద్ధి
- తెగుళ్ల నివారణ, అధిక దిగుబడులకు అవకాశం

**గడివేముల:** పొలంలో ఒకే రకం పంటను ఏళ్ల తరబడి సాగుచేయడం ద్వారా దిగుబడులు తగ్గుతాయని, పంటల్లో ఎదుగుదల ఉండదని చీడపీడల ఉధృతి కూడా అధికంగా ఉంటుందని, అందుకే పంట మార్పిడి చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. పొలంలో ఒకేరకం గాకుండా వేరు వేరు పంటలను ఒక క్రమంలో సాగు చేస్తే అధిక ప్రయోజనాలు ఉంటాయని చెబుతున్నారు. పంట మార్పిడితో కలిగే ప్రయోజనాలను వారు వివరించారు. పంట మార్పిడి చేయడం ద్వారా ప్రకృతి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవచ్చు. తక్కువ పెట్టుబడితో భూసారానికి ఇబ్బంది లేకుండా అధిక లాభం పొందవచ్చు. ఖరీఫ్ సీజన్‌కు సిద్ధమవుతున్న నేపథ్యంలో పంట మార్పిడి ఆవశ్యకతపై రైతులకు ప్రయోజనకరమైన సూచనలు ఇలా...

**ఒకే తరహా పంట సాగుతో నష్టాలు**

- ▲ వేరు వ్యవస్థ ఒకే లోతుకు పోవడం వల్ల నేలలో ఆ లోతు వరకు ఉన్న పోషకాలను మాత్రమే మొక్కలు వినియోగించుకుంటాయి.
- ▲ ఏటా ఒకే రకం పంట పండించడం వల్ల చీడ పీడలు, కలుపు బెడద ఎక్కువగా ఉంటుంది. పైరు కూడా అభివృద్ధి చెందదు. దిగుబడులు తగ్గుతాయి. రైతులకు పెట్టుబడి భారం పెరుగుతుంది.
- ▲ నేల కోతకు గురవుతుంది. పండిన పంట నాణ్యతగా ఉండదు. ఫలితంగా గిట్టుబాటు ధర లభించదు. దీంతో రైతులకు నష్టం వచ్చే అవకాశం ఉంది. మార్కెట్ సమస్యలు కూడా ఎదురవుతాయి. అందుకే వేర్వేరు పంటలను సాగు చేసుకోవాలి.
- ▲ ఎక్కువ లోతుకు వేర్లు వెళ్లే పైర్లు, తక్కువ లోతుకు వేర్లు వెళ్లే పైర్లు ఒకదాని తర్వాత ఒకటి సాగు చేయాలి. ఉదాహరణకు జొన్న–పత్తి.
- ▲ నేలను నిర్వీర్యం చేసే పంటలను, సారాన్ని అభివృద్ధి చేసే పంటలను ఒకదాని తర్వాత ఒకటి సాగు చేసుకోవాలి.

**పంట మార్పిడితో భూసారం వృద్ధి**

- ▲ వరి పంట సాగు చేసే ముందు పచ్చిరొట్ట పైర్లు సాగు చేయడం వల్ల భూసారం పెరిగి సేంద్రియ పదార్థం భూమిలో ఎక్కువగా ఉండటం వల్ల పైరు ఏపుగా పెరుగుతుంది.


పంటను సాగు చేసేందుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతన్న

- ▲ వరి తర్వాత అపరాలు లాంటి పైర్లు సాగు చేయడం వల్ల భూమిలో సేంద్రియ పదార్థం బాగా వృద్ధి చెందుతుంది. దీంతో పంటపై వచ్చే శిలీంధ్రాల ఉధృతి తగ్గుతుంది.
- ▲ వరి తర్వాత గింజ జాతికి చెందిన శనగ, పెసర, మినుము, వేరుశనగ వంటివి సాగు చేమడం వల్ల వాటి వేర్లలోని రైజోబియస్ బ్యాక్టీరియా గాలిలోని నత్రజనిని తీసుకుంటుంది. వేర్లలో బుడిపెల మాదిరిగా ఏర్పడి తర్వాత సాగు చేసే పంటలకు మంచి సారాన్ని అందిస్తాయి.

**మంచి దిగుబడులకు అవకాశం**

రైతులు తమ పొలంలో ఏటా ఒకే రకం పంట సాగు చేస్తున్నారు. నీటి పారుదల కింద వరి తప్ప ఇతర పంటలు సాగు చేయడం లేదు. దీంతో వరిలో చీడపీడల బెడద ఎక్కువై సాగు ఖర్చులు పెరుగుతున్నాయి. దీనిని నివారించేందుకు పంట మార్పిడి విధానం ఉన్నతమైనది. పంట మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలు రైతులకు ఒకసారి అనుభవంలోకి వస్తే ఆ విధానమే కొనసాగిస్తారు. వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది ఇప్పటికే గ్రామాల్లో పంట మార్పిడి విధానంపై రైతులకు విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. పంట మార్పిడి వల్ల నాణ్యమైన దిగుబడులను సాధించేందుకు వీలవుతుందని వివరిస్తున్నారు.

## అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి


కౌంటింగ్ ఏర్పాట్లపై ట్రైనీ కలెక్టర్‌తో చర్చిస్తున్న కర్నూలు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ

**కర్నూలు (టౌన్):** ఓట్ల లెక్కింపు సమయంలో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని కర్నూలు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ సూచించారు. ఈనెల 4వ తేదీన రాయలసీమ యూనివర్సిటీలో చేపడుతున్న ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పా ట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఆదివారం రాయలసీమ యూనివర్సిటీలోని సైన్సు బ్లాక్‌లో కర్నూలు అసెంబ్లీ కౌంటింగ్ హాలులో ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్ నుంచి బాలెట్‌బాక్స్‌లు తీసుకొచ్చినప్పటి నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి విషయం కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా జరిగాలని సూచించా రు. ఎక్కడా ఎటువంటి అపోహలు, సందేహాలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కర్నూలు అసెంబ్లీ, పార్లమెంటు ఈవీ ఎంలు భద్రపరచిన స్ట్రాంగ్‌రూమ్‌లను, వాటికి వేసిన సీళ్లను పరిశీలించి లాగ్‌బుక్స్‌లో సంతకం చేశారు. అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, అసిస్టెంట్ ఆర్‌ఓ మోహన్ కుమార్, మెప్మా పీడీ నాగశివలీల, డీఈఈ రవిప్రకాష్‌నాయుడు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### శుద్ధమైన తాగునీరు అందించండి


రంగు మారిన నీరు

**కల్లూరు:** శుద్ధమైన తాగునీరు అందించాలని మండల పరిధిలోని పర్ల గ్రామస్తులు కోరుతున్నారు. గత కొన్ని రోజులుగా కుళాయిల నుంచి తాగునీరు రంగు మారి వస్తోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కలుషిత నీటితో అనారోగ్య సమస్యలు తలెత్తకముందే అధికారులు స్పందించి శుద్ధమైన తాగునీరు అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### వాటర్ ట్యాంకుల శుద్ధీకరణ


బీసీ కాలనీలోని ట్యాంకును శుభ్రం చేస్తున్న వాటర్ వర్కర్లు

**కోడుమూరు రూరల్:** పట్టణ ప్రజలకు కొళాయిల ద్వారా శుభ్రమైన తాగునీటిని విడుదల చేయాలని పంచాయతీ ఈఓ అజయ్‌భాస్కర్ వాటర్ వర్కర్లను ఆదేశించారు. ఆదివారం పట్టణంలోని మంచినీటి ట్యాంకులను పరిశీలించారు. వాటర్ వర్కర్ల చేత శుభ్రం చేయించడంతో పాటు, నీటిని క్లోరినేషన్ చేయించారు. ఈఓ మాట్లాడుతూ.. ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంతో పాటు, క్లోరినేషన్ చేసిన తర్వాతే నీటిని కొళాయిలకు విడుదల చేయాలని సూచించారు. నీటి విడుదలలో ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని ఈఓ పేర్కొన్నారు.

### మద్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న సెబ్ అధికారులు

**కోడుమూరు రూరల్:** కోడుమూరు సెబ్ పరిధిలోని కృష్ణగిరి మండలం పుట్లూరు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బోయ మధును అదుపులోకి తీసుకుని 23 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నా, సారా తయారు చేస్తున్నా తమకు సమాచారం అందించాలని కోరారు. వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. దాడుల్లో సెబ్ ఎస్‌ఐ అలీబేగ్, సిబ్బంది వెంకటేష్‌నాయక్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### కొత్తూరులో జడ్జి పూజలు


జడ్జి కుటుంబ సభ్యులకు తీర్థప్రసాదాలు అందిస్తున్న దృశ్యం

**పాణ్యం:** మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వ స్వామి ఆలయంలో ఆదివారం కృష్ణా జిల్లా నూజివీడు అడిషనల్ జిల్లా జడ్జి శైలజ ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు, అర్చనలు, సహస్ర పూజలు చేశారు. ఆలయ చరిత్రను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల తర్వాత శేషవస్త్రాలతో సన్మానించారు. ఈఓ రామకృష్ణ, ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, అర్చకులు సురేష్‌స్వామి తదితరులు ఉన్నారు.

### సంబరాలు నిషేధం

**గూడూరు:** ఎన్నికల్లో గెలిచే అభ్యర్థుల తరుపున గ్రామాల్లో సంబరాలు జరుపుకోవడం నిషేధమని గూడూరు ఎస్‌ఐ హనుమంతప్ప అన్నారు. ఆదివారం ఎస్‌ఐ, పోలీసులు ఆర్.ఖానాపురం, మునుగాల, మల్లాపురం, గూడూరు, చనుగొండ్ల గ్రామాల్లో పర్యటించారు. సమావేశాలు, సభలు పెట్టి గ్రామస్తులతో మాట్లాడారు. పోలీసుల ఆదేశాలు ఉల్లఘించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### తైక్వాండో క్రీడాకారులకు బెల్ట్‌ల ప్రదానం

**కర్నూలు (టౌన్):** స్థానిక సంకల్‌బాగ్‌లోని టీజీ నివాసంలో తైక్వాండో క్రీడాకారులకు కలర్ బెల్టులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను చిన్నానాటి నుంచే క్రీడల వైపు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో తైక్వాండో శిక్షకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## డ్రైనేజీలో పూడికను తొలగించండి


చెత్త పేపర్లతో నిండిన డ్రైనేజీ కాలువ

**కల్లూరు:** వాతావరణ మార్పులు, నైరుతి రుతుపవనాల రాకతో వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో డ్రైనేజీలో పూడికను తొలగించి వర్షపు నీరు నిల్వ ఏర్పడకుండా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. మండల పరిధిలోని చిన్నటేకూరు గ్రామం మెయిన్ రోడ్డులోని డ్రైనేజీ కాలువ చెత్త చెదారం, ఇతర వ్యర్థాలతో నిండిపోయింది. కాలువలో చెత్త అలాగే ఉంటే దోమలు, ఈగలు, లార్వాలు అభివృద్ధి చెంది వ్యాధులు వచ్చే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతోపాటు వర్షం కురిస్తే నీరు ముందుకు వెళ్లకుండా కాలువలోని చెత్త చెదారం, ప్లాస్టిక్ పేపర్లు అడ్డు పడి వీధుల్లోకి చేరే అవకాశం ఉందని వెంటనే డ్రైనేజీలో పూడిక తొలగించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

## మాధవుని గీతాజ్ఞానమే త్రైత సిద్ధాంతం


త్రైత సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

**ఓర్వకల్లు:** మాధవుడు ప్రబోధించిన గీతాజ్ఞానమే త్రైత సిద్ధాంతమని మిడుతూరు ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక అధ్యక్షులు రామచంద్రుడు అన్నారు. ఆదివారం మండలంలోని కాల్వబుగ్గ, ఉప్పలపాడు గ్రామాలలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రామచంద్రుడు మాట్లాడుతూ.. భగవద్గీతలోని పురుషోత్తమ ప్రాప్తి యోగం అధ్యాయంలో 16వ శ్లోకంలో జీవాత్మ క్షర పురుషుడని, ఆత్మ అక్షర పురుషుడని ప్రబోధించారు. అలాగే 17వ శ్లోకంలో పరమాత్మ పురుషోత్తముడని, జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అనే మూడు ఆత్మలు ఆధ్యాత్మికంలో ప్రధానమైనవిగా అర్థం చేసుకోవాలని సూచించారు. వీటి ఆధారంగానే ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులస్వామి త్రైత సిద్ధాంత భగవద్గీతను స్పష్టంగా రచించినట్లు తెలిపారు. మధ్యాత్మ ఆరాధనతో ధర్మస్థాపన జరుగుతుందని, అదే త్రైత సిద్ధాంత ముఖ్య ఉద్దేశమని ప్రబోధిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కమిటీ సభ్యులు శ్రీనివాసులు, రాఘవేంద్ర, సుజాత, హైమావతి, సుబ్బలక్ష్మి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు


కోడుమూరులో ప్రజలకు సూచనలిస్తున్న ఎస్‌ఐ

**కోడుమూరు రూరల్:** ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో అలజడులు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కోడుమూరు ఎస్‌ఐ బాల నరసింహులు హెచ్చరించారు. ఆదివారం కోడుమూరు పట్టణంలోని బీసీకాలనీ, బోయవీధి, ఎస్సీ కాలనీల్లో పర్యటించారు. మైక్ ద్వారా ప్రజలకు సూచనలిచ్చారు. ఈనెల 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని తెలిపారు. ఎన్నికల ఫలితాలు 4వ తేదీ వెలువడతున్న దృష్ట్యా స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో 144సెక్షన్ అమలు చేస్తున్నామని, ప్రజలెవరూ గుంపులుగా తిరగరాదని, ఫలితాలు వెలువడిన తర్వాత గెలిచిన వారు విజయోత్సవ ర్యాలీలు, సభలు చేపట్టరాదని సూచించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.


## జీవనశైలి మార్పులతోనే కీళ్లవాతం నివారణ



డాక్టర్ శ్రీహరిరెడ్డిని సన్మానిస్తున్న హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్ తదితరులు

**కర్నూలు(హాస్పిటల్):** జీవనశైలిలో మార్పులు చేసుకోవడం ద్వారానే కీళ్లవాతం వల్ల వచ్చే ఇబ్బందులు నివారించుకోవచ్చని ప్రముఖ కీళ్లవ్యాధి నిపుణులు డాక్టర్ జి. శ్రీహరిరెడ్డి చెప్పారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక ఏ.క్యాంపులోని కర్నూలు హెల్త్‌క్లబ్‌లో కీళ్ల నొప్పుల పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆర్థరైటిస్ అనేది వ్యాధి కాదని, అదొక లక్షణమని చెప్పారు. సాధారణంగా 50 నుంచి 60 ఏళ్లు దాటిన తర్వాత వచ్చేది ఆస్టియో ఆర్థరైటిస్ అని, ఇన్‌ఫ్లమేటిరి ఆర్థరైటిస్ ఇమ్యూన్‌సిస్టమ్ మనకు వ్యతిరేకంగా పనిచేయడం వల్ల వస్తుందని తెలిపారు. ఇందులో సాధారణంగా రుమటాయిడ్ ఆర్థరైటిస్, లూపస్, ఆంకిలోజింగ్ ఆర్థరైటిస్, సోరి యాసిస్, గౌట్ తదితరాలు ఉంటాయని వివరించారు. ఆస్టియో ఆర్థరైటిస్‌కు కీళ్లమార్పిడి ఒక్కటే పరిష్కారమన్నారు. కీళ్లవాతానికి అనేక ఆధునిక మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఈ రుగ్మతలో ఉదయం లేస్తూనే నొప్పులు ఉండటం, అరగంట నుంచి గంట తర్వాత అవే తగ్గిపోతుంటాయన్నారు. కొందరికి కీళ్లవద్ద వాపు, ఎర్రగా ఉండటం కనిపిస్తుందన్నారు. నొప్పుల వల్ల సాధారణ పనులు చేసుకోలేరన్నారు. ఇది చిన్నవారి నుంచి పెద్ద వారికి ఎవరికైనా వస్తుందన్నారు. ముఖ్యంగా మహిళల్లో ఎక్కువగా వస్తోందని చెప్పారు. ఆర్థరైటిస్ కేవలం కీళ్లకే కాకుండా శరీరంలో ఏ అవయవన్నైనా బాధించవచ్చన్నారు. లూపస్‌లో కొన్నిసార్లు కిడ్నీ ఫెయిలై జీవితాంతం డయా లసిస్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఆర్థరైటిస్ జన్యుపరంగా, స్మోకింగ్ వల్ల, జీవనశైలిలో మార్పు లు, జంక్‌ఫుడ్ తీసుకోవడం వల్ల, మానసిక ఒత్తిళ్ల కారణంగా వస్తుందని తెలిపారు. ఆహారంలో మా ర్పులు చేసుకోవడం, శారీరక వ్యాయామం చేయడం, ధ్యానం చేయాల్సి ఉంటుందన్నారు. ఈ రుగ్మతను కొన్ని రకాల రక్తపరీక్షల ద్వారా నిర్ధారణ చేస్తామన్నారు. కీళ్లనొప్పులు తగ్గించుకునేందుకు కొందరు స్టిరాయిడ్స్, నొప్పుల మాత్రలు అధికంగా వాడితే సైడ్ ఎఫెక్ట్స్ ఎక్కువగా ఉంటాయన్నారు. అనంతరం ఆయనను కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు డాక్టర్ భవానీప్రసాద్, కోశాధికారి వెంకటరాముడు, సిరిగిరెడ్డి జయారెడ్డి, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

## డీటీఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక


నినాదాలు చేస్తున్న డీటీఎఫ్ నూతన కమిటీ సభ్యులు

**కర్నూలు కల్చరల్:** డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం టౌన్ మోడల్ పాఠశాలలో జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశంలో నూతన కమిటీ ఎంపిక జరిగింది. నూతన అధ్యక్షుడిగా వెంకటరాముడు, ప్రధాన కార్యదర్శిగా గట్టు తిమ్మప్ప, ఉపాధ్యక్షులుగా గీత, నాగరాజుగౌడ్, ఈశ్వర్‌రెడ్డి, రోషన్న, జిల్లా కార్యదర్శులుగా రామన్న, గంగాధర్, వెంకటేశప్ప, ముద్దు రంగప్ప, రమేష్, రాష్ట్ర కౌన్సిలర్లుగా కరేకృష్ణ, గోట్ల చంద్రశేఖర్, మద్దయ్య, మనోరంజని, రవీంద్ర, లక్ష్మీ నారాయణ, చంద్రశేఖర్‌యాదవ్‌ను ఎన్నుకున్నారు.

## 67 క్వింటాళ్ల విత్తనాలు మంజూరు

**ఓర్వకల్లు:** మండలానికి తొలి విడత కింద 67 క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాలు మంజూరైనట్లు ఏఓ సుధాకర్ తెలిపారు. 2024–25 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం రాయితీ విత్తనాలలో వేరుశనగ–15 క్వింటాళ్లు, కందులు–35 క్వింటాళ్లు, పెసులు– 6 క్వింటాళ్లు, కొర్ర–2 క్వింటాళ్లు, పిల్లిపెసర–2 క్వింటాళ్లు, జీలుగ–7 క్వింటాళ్ల చొప్పున మొత్తం 67 క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాలు మంజూరుచేసినట్లు చెప్పారు. విత్తన రకాన్ని బట్టి ప్రభుత్వం నిర్దేశించిన రాయితీ ప్రకారం రైతులకు పంపిణీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల రైతులు సమీపంలోని రైతు భరోసా కేంద్రాలలో తమ ఆధార్ కార్డు తీసుకెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

### సంతాపం

**పాణ్యం:** మండల కేంద్రానికి చెందిన జట్‌ప్రెఎస్‌ఎఫ్ మండల యాంకర్‌గా పనిచేస్తున్న శింగారపు నాగరాజు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన తెలిసిందే. ఆదివారం ఆయన భౌతిక కాయానికి ప్రముఖులు నివాళులర్పించారు. పాణ్యం మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సద్దల సూర్య నారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, వైఎస్సార్‌సీపీ నాయకులు కరుణాకర్‌రెడ్డితో పాటు పలువురు ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు ఆ గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. అలాగే కుటుంబ సభ్యులను ఓదార్చారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

### క్రీడలతో క్రమశిక్షణ

**కర్నూలు (టౌన్) :** చిన్నారులను క్రమ శిక్షణ కలిగిన పౌరులుగా తీర్చిదిద్దే సత్తా క్రీడలకే ఉందని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. ఆదివారం స్థానిక మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సిలంబం (కర్రసాము) వేసవి క్రీడా శిక్షణ శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం వల్ల ప్రమాదకర అలవాట్లకు దూరంగా, ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చన్నారు. క్రీడల్లో తమ పిల్లలను ప్రోత్సహించేందుకు తల్లిదండ్రులు మరింత ముందుకు రావాలన్నారు.

### ఉషా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

**కర్నూలు (టౌన్) :** ఉష వేసవి శిక్షణ శిబిరాన్ని విద్యార్థినీ, విద్యార్థులు వినియోగించుకోవాలని జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి జి.శ్రీనివాసులు అన్నారు. ఆదివారం స్థానిక పెద్దమార్కెట్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉషా వేసవి శిబిరంలో పాల్గొని చిన్నారులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఉషా సంఘం కార్యదర్శి టీ. శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం 6.30 గంటల నుంచి 8 గంటల వరకు ఉష క్రీడల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.

## కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేయండి


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు

**పాణ్యం:** సార్వత్రిక ఎన్నికల తుది ఘట్టమైన కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. ఆయన ఆదివారం ఆర్జీఎం, శాంతిరామ్ ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు కౌంటింగ్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. 4వ తేదీ ఉదయం 5 గంటలకల్లా సిబ్బంది కౌంటింగ్ కేంద్రాల వద్దకు చేరుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లో రౌండ్ల వారీగా అభ్యర్థులకు వచ్చిన ఓట్ల వివరాలు కమ్యూనికేషన్ సెంటర్‌కు తెలియజేయాలని సూచించారు. సాధ్యమైనంత వరకు తగ్గించి కౌంటింగ్ పాసులు జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్‌ఓలను కలెక్టర్ ఆదేశించారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఏజెంట్లు అవాంతరాలు సృష్టించినా ఇబ్బందులు కలిగించినా నిర్దాక్షిణ్యంగా వ్యవహరించాలన్నారు. అలాంటి వారిని బయటకు పంపించాలన్నారు. సాయంత్రం 5 గంటల్లోపు ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెటు ఓట్ల లెక్కింపు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి, పద్మజ, మల్లికార్జునరెడ్డి, రామేశ్వరెడ్డి, దాస్ తదితరులు పాల్గొన్నారు.

## 'అలుపెరగని పోరాటం' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, రచయితలు

**కర్నూలు కల్చరల్:** ప్రబీర్ పుర్కాయస్తా రాసిన 'అలుపెరగని పోరాటం' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో జరిగింది. హైకోర్టు న్యాయవాది జయరాజు ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని ప్రజల హక్కులను కాపాడుకోవాలన్నారు. మతోన్మాద శక్తుల అరాచకాలను వామపక్ష ప్రజాతంత్ర లౌకిక అభ్యుదయ వాదులందరూ ఏకమై ఎదుర్కొని ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విశ్రాంత ఎకనామిక్స్ అధ్యాపకులు మన్సూర్ రెహమాన్ మాట్లాడుతూ ప్రస్తుత బీజేపీ పాలకులకు కమ్యూనిజం, క్రైస్తవులు, ముస్లింలు, దళితులు అన్నా నచ్చదన్నారు. జాతీయ నాయకులను సైతం తక్కువ చేసి చూస్తున్నారన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రజా శక్తి జనరల్ మేనేజర్ నరసింహ, బుక్ హౌస్ మేనేజర్ మధు, తదితరులు పాల్గొన్నారు.

## స్కేటింగ్ క్రీడతో ఉజ్వల భవిష్యత్తు


స్కేటింగ్‌లో మెడల్స్ అందుకున్న క్రీడాకారులు

**కర్నూలు (టౌన్):** స్కేటింగ్ క్రీడతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, శిక్షణలో మరిన్ని మెలకువలు నేర్చుకొని రాణించాలని మాజీ మంత్రి కేఈ ప్రభాకర్ అన్నారు. ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఉన్న స్కేటింగ్ రింక్‌లో స్కేటింగ్ వేసవి శిక్షణ శిబిరం ముగింపును పురస్కరించుకొని క్రీడాకారులకు స్కేటింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆయన మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ కర్నూలు నగరంలో 23 సంవత్సరాలుగా స్కేటింగ్ సంఘం ఎంతో మంది క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీల్లో రాణించే విధంగా శిక్షణ అందిస్తుందన్నారు. తన వంతు సహకారం ఉంటుందని చెప్పారు. జిల్లా ఒలంపిక్ సంఘం సీఈఓ విజయకుమార్, స్కేటింగ్ సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు సుధాకర్‌గౌడ్, సునీల్‌కుమార్, ఒలింపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు, స్కేటింగ్ శిక్షకులు అబుబకార్ పాల్గొన్నారు.

## నృత్యోత్సవ సంబరం

**కర్నూలు కల్చరల్:** శ్రీ వేంకటేశ్వర సంగీత నృత్య కళా నిలయం ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్యాంప్ ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహించిన వేడుకల్లో చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. నృత్య శిక్షకురాలు దేవీ శ్రీ ప్రదర్శించిన సింహ నంది నాట్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అంతకు ముందు విశ్రాంత ప్రిన్సిపాల్ కొట్టే చెన్నయ్య, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, శ్రీ వెంకటేశ్వర సంగీత నృత్య కళా నిలయం వ్యవస్థాపకులు నాగమల్లేశ్వరి జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించారు.



జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభిస్తున్న అతిథులు, సింహ నంది నాట్యం చేస్తున్న దేవిశ్రీ

## పలకరించిన తొలకరి

**కర్నూలు (టౌన్):** రాయలసీమ జిల్లాల్లోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. ఈ ప్రభావం వల్ల ఆదివారం సాయంత్రం నుంచి తొలకరి వర్షాలు మొదలైంది. మెరుపులు, ఉరుములు, గాలులతో కూడిన వర్షాలు వివిధ ప్రాంతాల్లో కురిశాయి. నందికొట్కూరులో పిడుగుపాటుకు ఓ వ్యక్తి మరణించాడు. నందవరం, ఎమ్మిగనూరు, కృష్ణగిరి, కోడుమూరు, కర్నూలు, కల్లూరు తదితర మండలాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. నంద్యాల జిల్లాలో కూడా పలు మండలాల్లో వర్షాలు పడ్డాయి. రుతుపవనాల ప్రభావం వల్ల రానున్న రోజుల్లో ఆశాజనకంగా వర్షాలు పడే అవకాశం ఉంది.

## డాక్టర్ వెంకటరంగారెడ్డికి సన్మానం

**కర్నూలు(హాస్పిటల్):** కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించి గత నెల 31న పదవీ విరమణ పొందిన డాక్టర్ వి.వెంకటరంగారెడ్డిని ఘనంగా సన్మానించారు. స్థానిక డాక్టర్స్ కాలనీలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భవన్‌లో ఆదివారం రాత్రి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టుల సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ ఆసుపత్రికి అందించిన సేవలను మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి విజయమనోహరి, వైద్యులు కొనియాడారు. కేవలం పది నెలల కాలంలోనే ఆసుపత్రికి అవసరమైన విలువైన వైద్యపరికరాలు తెప్పించి రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందేలా చేశారని గుర్తు చేశారు. డాక్టర్ వెంకటరంగారెడ్డి మాట్లాడుతూ తన బాల్యం గ్రామీణ వాతావరణంలో కొనసాగిందని, పేదకుటుంబంలో జన్మించిన తాను దీపాల కింద చదువుకున్నట్లు గుర్తు చేసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన తమకు అప్పట్లో పెద్దగా చదువు చెప్పేవారు కాదని, తాను సొంతంగా ఐదు కిలోమీటర్లు నడిచి ట్యూషన్‌కు వెళ్లి కష్టపడి చదువుకున్నట్లు తెలిపారు. ఆ తర్వాత ఇంటర్‌మీడియెట్‌లో మంచి మార్కులు తెచ్చుకుని వైద్యసీటును సాధించినట్లు తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేయడం, పేదలకు సేవలందించడం మరిచిపోలేని అనుభూతి అన్నారు. ఈ క్రమంలో తనకు జీవితంలో మరిచిపోలేని ఎంతో మంది స్నేహితులు తోడయ్యారన్నారు. తాను సాధించలేని ఐఏఎస్‌ను తన కూతురు సాధించేలా చేసినట్లు చెప్పారు. సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి, గ్యాస్ట్రో ఎంట్రాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ మోహన్‌రెడ్డి, పాల్గొన్నారు.